ధరలకు కళ్లెం

బియ్యం, కందిపప్పు విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు



రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు విక్రయాలు

- బియ్యం కిలో రూ.49, కందిపప్పు రూ.160
- రెండు రోజుల్లో 70 క్వింటాళ్ల బియ్యం, 19 క్వింటాళ్ల కందిపప్పు అమ్మకం

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):
బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించింది. దీనిలో భాగంగా బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు విక్రయించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు అధికారులు గురు, శుక్రవారాల్లో నగరంలోని పదమూడు రైతుబజార్లు, డీమార్ట్, స్పెన్సర్స్, రిలయన్స్, మోర్‌కు చెందిన 55 మాల్స్..మొత్తం 68 కౌంటర్లు ఏర్పాటుచేశారు. సోనామసూరి (స్టీమ్డ్) బియ్యం కిలో రూ.49కు, 'రా' రైస్ రూ.48కు, కందిపప్పు కిలో రూ.160కు అమ్ముతున్నారు. రెండు రోజుల్లో 70 క్వింటాళ్ల బియ్యం, 19 క్వింటాళ్ల కందిపప్పు విక్రయాలు జరిగినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరల గురించి పెద్దగా పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. బియ్యంతో పాటు పప్పులు, వంటనూనెల ధరలు అడ్డూ అదుపులేకుండా పెరిగి పోయాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 నుంచి రూ.190 వరకు అమ్ముతున్నారు. అదేవిధంగా బియ్యం కిలో రూ.55 నుంచి రూ.65కు విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఏడాదికి రెండు, మూడుసార్లు బియ్యం ధరలు పెంచుతుంటారు. ఒకసారి పెంచితే తరువాత తగ్గించడం ఉండదు. ఈ నేపథ్యంలో తొలుత బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు విక్రయించాలన్న ... మిగతా 4వ పేజీలో

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

జిల్లా సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించినట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి



- విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డు మరింత అభివృద్ధి
- సీఆర్‌జెడ్-3లో ప్రాంతాలు సీఆర్‌జెడ్-2లోకి మార్చేందుకు గల సాధ్యాసాధ్యాలు పరిశీలన
- తాడి గ్రామం తరలింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అనకాపల్లి జిల్లా యంత్రాంగానికి సూచన
- నక్కపల్లిలో బయోటెక్ పార్కు ఏర్పాటు
- పీపీపీ విధానంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి
- తిమ్మాపురంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్



కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):
విశాఖ జిల్లాలో భూ ఆక్రమణదారులపై కఠినంగా ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు పరిరక్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సమీక్షలో ప్రస్తావనకు వచ్చిన పలు అంశాలను కలెక్టర్ శుక్రవారం విలేకరులకు వివరించారు.

భూ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు ఉపేక్షించవద్దని, కేసులు నమోదుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా 22 (ఎ) జాబితా నుంచి భూములు మినహాయింపు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారన్నారు. పరవాడ ఫార్మాసిటీకి ఆనుకుని తాడి గ్రామం తరలింపు గురించి సీఎం ప్రత్యేకించి చెబుతూ పునరావాసం, మరోచోట గ్రామస్థులకు ఇళ్ల నిర్మాణం వంటి అంశాలకు నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అనకాపల్లి జిల్లా యంత్రాంగాన్ని సూచించారన్నారు. నక్కపల్లి ప్రాంతంలో బయోటెక్ పార్కు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ పరిధిలో రహదారుల అభివృద్ధికి పీపీపీ విధానం అమలుచేయాలని సూచించారని తెలిపారు. భీమిలి మండలం తిమ్మాపురంలో ఐదెకరాలలో యూనిటీ మాల్ ఏర్పాటుకు కేంద్రం రూ.172 కోట్లతో ప్రాజెక్టును మంజూరుచేసిందని పేర్కొంటూ దాని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. పీఎం ఏక్తా మాల్ పేరుతో కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసే ఈ మాల్‌లో చేనేత వస్త్రాలతోపాటు మిగిలిన సాధారణ మాల్స్‌లో మాదిరిగా అన్నిరకాల వస్తువులు లభ్యమవుతాయని, దీనికి సంబంధించి ... మిగతా 4వ పేజీలో

నగరంలో ఫ్లైఓవర్లకు ప్రత్యామ్నాయంగా 2 ఎలివేటెడ్ కారిడార్లు

- జాతీయ రహదారుల సంస్థ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశం
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్రం నుంచి అనుమతులు తీసుకుంటామని వెల్లడి



- కిలోమీటరుకు రూ.125 కోట్లు వ్యయం

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):
నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పలుచోట్ల ఫ్లైఓవర్లు నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ ప్రతిపాదించింది. అయితే ఫ్లైఓవర్లకు ప్రత్యామ్నాయంగా రెండుచోట్ల ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎనిమిది ఫ్లైఓవర్లకు ఒకటి, నాలుగు ఫ్లైవోవర్లకు ఒకటి చొప్పున రెండు ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మిస్తే వాహనదారులకు సమయం ఆదా అవుతుందని వివరించడంతో ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. గురువారం రాత్రి ఎయిర్‌పోర్టు లాంజ్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన ... మిగతా 4వ పేజీలో

సకాలంలో ఇంజనీరింగ్ ప్రవేశాలు

- వెబ్ ఆప్షన్స్‌కు ముగిసిన గడువు
- 16న తొలివిడత సీట్ల అలాట్‌మెంట్
- గత ఏడాదితో పోలిస్తే రెండు వారాలు ముందు ప్రారంభమైన అడ్మిషన్స్ ప్రక్రియ



- ప్రవేశాలు పెరుగుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):
ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను ఉన్నత విద్యా శాఖ ఈ ఏడాది వేగంగా ప్రారంభించింది. గత ఏడాదితో పోలిస్తే రెండు వారాలు ముందు రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ మొదలైంది. తొలివిడత సీట్ల కేటాయింపు గడిచిన ఏడాదితో పోలిస్తే 24 రోజుల ముందే పూర్తికానున్నది. ఇది ప్రవేశాల పెరుగుదలకు దోహదం చేస్తుందని నగర పరిధిలోని ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. గతంలో తొలి విడత నుంచి మూడో విడత వరకూ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తిచేసేందుకు కనీసం రెండు నెలలు సమయం తీసుకునేవారని, ఇప్పుడు వేగంగా పూర్తిచేయడంపై ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ దృష్టి సారించడం కళాశాలలకు సానుకూల అంశమన్నారు. గతంలో అడ్మిషన్స్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభించడం, రెండు, మూడు విడతలు సుదీర్ఘంగా నిర్వహించడం వల్ల వందలాది మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతుండేవారని, అదే విధంగా మరికొంతమంది డీమ్డ్ వర్సిటీల్లో చేరిపోయేవారని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఉన్నత విద్యా శాఖ వేగంగా ప్రక్రియను ప్రారంభించడం వల్ల అటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

గత ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి (2023-24 విద్యా సంవత్సరం) జూలై 24 నుంచి రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 12న తొలి విడత సీట్లను కేటాయించారు. ఈ విద్యా సంవత్సరానికి (2024-25) ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఎనిమిదో తేదీ నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించిన అధికారులు...ఈ నెల 16న తొలి విడత సీట్లను కేటాయించనున్నారు. గత ఏడాదితో పోలిస్తే సుమారు 24 రోజులు ముందుగానే తొలి విడత అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తికాబోతోంది.

ఫీజుల్లో అస్పష్టతతో ఇబ్బంది..

రాష్ట్రంలో ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ మూడేళ్ల కాలానికి ఫీజులను సిఫారసు చేసింది. ఈ మేరకు తొలుత కనిష్ఠ ఫీజుగా రూ.45 వేలను, గరిష్ఠ ఫీజుగా రూ.1.05 లక్షలుగా నిర్ణయించింది. జిల్లాలో గరిష్ఠ ఫీజు జాబితాలో గాయత్రీ విద్యాపరిషత్ మాత్రమే చోటు దక్కించుకుంది. మిగిలిన కాలేజీలకు కేటగిరీలను బట్టి ప్రభుత్వం ఫీజు నిర్ణయించింది. అయితే, ఈ ఫీజులకు సంబంధించిన సిఫారసులను గత ప్రభుత్వం ఆమోదించ కుండా మార్చేందుకు యత్నించింది. దీనిపై కాలేజీ యాజ మాన్యాలు కోర్టును ఆశ్రయించగా కమిషన్ తొలి సిఫారసులను అమలు చేయాలని స్పష్టంచేసింది. అంటే, కనిష్ఠ ... మిగతా 4వ పేజీలో

జగదాంబ జంక్షన్‌కు క్లాక్‌టవర్ శోభ



జగదాంబ జంక్షన్‌కు క్లాక్ టవర్ కొత్తశోభను తెచ్చిపెట్టింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని ప్రధాన కూడళ్లను జీవీఎంసీ అభివృద్ధి చేస్తోంది. ఆ క్రమంలో జగదాంబ జంక్షన్‌ను అభివృద్ధి చేసిన అధికారులు రూ.85 లక్షల వ్యయంతో క్లాక్‌టవర్‌ను నిర్మించారు. నాలుగు వైపుల నుంచి చూసేవారికి సమయం తెలిసేలా భారీ గడియారాలను ఏర్పాటుచేశారు. చూడగానే పాతనగరం అనే భావన కలిగేలా రాజసం ఉట్టిపడే రంగులను అద్దారు. రాత్రిపూట క్లాక్‌టవర్ మరింత అందంగా కనిపించేందుకు కళ్లు మిరుమిట్లుగొలిపేలా రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. రాత్రి సమయంలో జగదాంబ జంక్షన్ వైపు వెళ్లేవారికి క్లాక్ టవర్ చూడగానే కొత్తఅనుభూతి కలుగుతుందనడంలో అనుమానం లేదు. - విశాఖపట్నం

విశాఖ కన్నతల్లిలా ఆదరించింది



మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు పుస్తకం అందజేస్తున్న వెంకయ్యనాయుడు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు 75 వసంతాలు పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రులు, సన్నిహితులు శుక్రవారం రుషికొండలోని ఓ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సంగమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు, నగర ప్రముఖులు పాల్గొన్నారు. - వివరాలు IV పేజీలో

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ లేనట్టే?

- పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్రం వెనకడుగు
- ప్రభుత్వ రంగ సంస్థలను మళ్లీ పట్టాలపైకి తేవాలని యోచన



- ఆ క్రమంలోనే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటన - మెయిన్‌లో

ఎండాడ వద్ద దారిదోపిడీ

లారీని ఆపి డ్రైవర్‌పై దాడి

- రూ.10 వేలు, సెల్‌ఫోన్ తీసుకుని పరారీ
- ముఠాను 24 గంటల్లో పట్టుకున్న పోలీసులు

ఎం.వి.పి.కాలనీ, జూలై 12:
గంజాయి సేవించి దారిదోపిడీలకు పాల్పడుతున్న ముఠాను నగర పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎం.వి.పి. క్రైమ్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వెంకటరత్నం కేసు వివరాలను తెలియచేశారు. పీఎం పాలేనికి చెందిన అరుగుల్ల భాను (19), తోట దుర్గాప్రసాద్ (19), మెరుగు నరసింహులుతో పాటు మరో ఐదుగురు బాలురు గురువారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో జాతీయ రహదారిపై ఎండాడ వద్ద ఆటుగా వెళుతున్న లారీని ఆపారు. డ్రైవర్‌పై దాడి చేసి, పది వేల నగదు, మొబైల్ తీసుకుని పరారయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదు బృందాలను ఏర్పాటుచేసి, నిందితులను 24 గంటల్లో విజయనగరంలో అరెస్టు చేసినట్టు డీసీపీ తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు బైకులు, రూ.ఐదు వేలు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరందరూ చెడు వ్యసనాలకు బానిసలై నేరానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. విలేఖరుల సమావేశంలో క్రైమ్ ఎ.సి.పి. వెంకటరావు, ఈస్ట్ క్రైమ్ సి.ఐ.ఎస్. ఆడమ్, క్రైమ్ ఎస్.ఐ.హరి, తదితరులు పాల్గొన్నారు.

హయగ్రీవ పనులకు బ్రేక్

జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

- న్యాయస్థానంలో యాజమాన్య హక్కుల కేసు
- తేలాకే ప్రాజెక్టు ముందుకు...
- ప్లాన్ రద్దు చేయాల్సిందిగా కోరిన జగదీశ్వరుడు



ఎండాడలో హయగ్రీవ పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ఎండాడలోని హయగ్రీవ ప్రాజెక్టుకు మరోసారి చుక్కెదురైంది. ఎక్కడి పనులు అక్కడ ఆపాలని జీవీఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం నుంచి ఎండాడలో స్థలం పొందిన జగదీశ్వరుడు యాజమాన్య హక్కులపై కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అక్కడ కేసు తేలక ముందే, ఇక్కడ పనులు పూర్తిచేస్తున్నారని, వాటివల్ల తాను నష్టపోతున్నానని జీవీఎంసీ కమిషనర్‌కు జగదీశ్వరుడు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు తేలాకే ప్రాజెక్టు పనులు కొనసాగించాలని, అప్పటివరకూ ఆపాలంటూ కమిషనర్ ఆదేశించారు. దాంతో హయగ్రీవ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి.

ఇదీ నేపథ్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వృద్ధులకు ఆశ్రమం నిర్మిస్తామని, ఉచితంగా నిర్వహిస్తామని చెప్పి సీహెచ్ జగదీశ్వరుడు హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ పేరుతో ఎండాడలో సర్వే నంబరు 92/3లో 12.51 ఎకరాలను అప్పటి రిజిస్ట్రేషన్ ధరకు తీసుకున్నారు. ప్రభుత్వానికి రూ.5.63 కోట్లు చెల్లించారు. ఆ తరువాత అందులో నిర్మాణం చేపట్టడానికి దరఖాస్తు చేయగా కలెక్టర్ నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం తీసుకురావాలని జీవీఎంసీ అధికారులు సూచించారు. అడ్డంకులు కల్పిస్తున్నారంటూ జగదీశ్వరుడు కోర్టును ఆశ్రయించడంతో నిబంధనల ప్రకారం ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుంచి మూడేళ్లలో పూర్తి చేయాలంటూ 2018లో షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. ఆ తరువాత ఆ స్థలం నుంచి 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి ఉన్నందున రివైజ్డ్ ప్లాన్ సమర్పించాలని సూచిస్తూ పనులు నిలుపు చేయాలని ఆర్డర్ ఇచ్చారు. దానిపై ఆయన మళ్లీ 2023లో కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో రెండు వారాలలో వివరణ ఇవ్వాలని, తదుపరి ఉత్తర్వులకు లోబడి పనులు చేసుకోవాలని ... మిగతా 4వ పేజీలో

కళాకారులను ప్రోత్సహించాలి


కళాకారుడి దంపతులకు సన్మాన దృశ్యం

సీతంపేట, జూలై 12: కళాకారులను ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో మారుతి నాయీ బ్రాహ్మణ డోలు, సన్నాయి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డోలు వాద్యంలో ఆల్ ఇండియా రేడియో ద్వారా ఏ గ్రేడ్ కళాకారుడు కె.గోవిందరావుకు సన్మానం శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. బీ మారావు, జి.శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, బాల రాజు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షులు సీహెచ్‌వీ సత్య నారాయణ,నాదశ్వర డోలు కళాకారులు పాల్గొన్నారు.

మాధవధారలో గురుపౌర్ణమికి ఏర్పాట్లు


ముస్తాబవుతున్న మాధవస్వామి మందిరం


సింహాచలం చేరే కొండ మెట్ల వద్ద మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

» సింహాచలం గిరి ప్రదర్శనకు వీలుగా సౌకర్యాలు

మురళీనగర్, జూలై 12 ; గురుపౌర్ణమి రోజు (ఈనెల 21న) సింహాచలం శ్రీ వరాహాలక్ష్మి నృసింహస్వామి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ముందురోజు 20వ తేదీన నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సింహగిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సింహాచలం దేవస్థానం అధికారులు, జీవీఎంసీ అధికారుల సమన్వయంతో ఈ ఏర్పాట్లు ప్రారంభించారు. శుక్రవారం మాధవధార పుణ్యక్షేత్రంలో ప్రాచీన శ్రీ మాధవస్వామి మందిరం, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున, వేణుగోపాల స్వామి ఆలయాల వద్ద పలు ఏర్పాట్లు చేస్తున్నారు. స్నానాల ఘాట్ వద్ద గిరి ప్రదక్షిణ రోజు, మరుసటి రోజు గురుపౌర్ణమి రోజున పుణ్య స్నానాలకు వచ్చే వేలాది భక్తుల కోసం వసతులు కల్పిస్తున్నారు.

అద్దంలా కొండ మార్గం

గురు పౌర్ణమి వేడుకల నేపథ్యంలో ఇప్పటికే జీవీఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇక్కడినుంచి సింహాచలం కొండకు చేరే దారి, అక్కడి నుంచి మెట్ల మార్గం పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. అలాగే తాత్కాలిక టాయిలెట్‌లు, తాగునీటి వసతులతో పాటు అత్యవసర వైద్య సదుపాయాలకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

ప్రేమ సమాజాన్ని సందర్శించిన న్యాయమూర్తి


పిల్లలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

డాబాగార్డెన్స్, జూలై 12: డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ శుక్రవారం సందర్శించారు. అక్కడ ఉన్న వృద్ధులు, పిల్లలతో మాట్లాడి వసతి, భోజన సదుపాయాలను అడిగి తెలుసుకుని తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యకమంలో జి.స్వర్ణ, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన ఓకార్యక్రమంలో పీఏలీఏపీయూఎస్ ఛైర్మన్ జి.వల్లభనాయుడు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించారు. హెల్మెట్ లేకుంటే శిక్షార్హనేరమని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ. 2.4 లక్షల జరిమానా

కొమ్మాది, జూలై 12: విశాఖ నార్త్‌జోన్ ట్రాఫిక్ సర్కిల్ స్టేషన్ల పరిధిలో నమోదైన వివిధ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు న్యాయస్థానం రూ. 2.70 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఎస్. కాంతారావు శుక్రవారం తెలిపారు. పీఎంపాలెం స్టేషన్ పరిధిలో 28 మందికి రూ. 47వేలు, ఆనందపురం పరిధిలో పలువురికి రూ. 90వేలు, భీమిలి పరిధిలో 14 మందికి రూ. 1.40 లక్షలు న్యాయస్థానం జరిమానా విధించినట్లు తెలిపారు.

అక్కయ్యపాలెం, జూలై 12: నాల్గో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించిన ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ తెలిపారు. రూ.2వేల నుంచి 9వేల వరకు మొత్తం రూ.35వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

యూఎల్సీ సమస్య పరిష్కరించాలి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతి పత్రమిస్తున్న స్థానికులు

అక్కయ్యపాలెం, జూలై 12: గ్రేటర్ 44వ వార్డు రామచంద్రానగర్, శ్రీనివాసనగర్‌ల్లో గత 40 ఏళ్లుగా నివశిస్తున్న తాము యూఎల్సీ 22ఏ సమస్య ఎదుర్కొంటున్నామని, దీనిని పరిష్కరించాలని ఆయా ప్రాంతాల్లోని కుటుంబాలు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎవరైనా కొత్తగా ఇల్లు కొనాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. అలాగే, శాసనసభ సమావేశాల్లో చర్చించి త్వరగా పరిష్కారం మయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


అమ్మవారు

జగదాంబ కూడలి, జూలై 12: వన్‌టౌన్‌లోని బురుజుపేటలోని కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. నిత్యపూజల్లో భాగంగా ఉదయం 7 గంటల సమయంలో అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం సేవలను అర్చకులు ఉభయదాతలతో కలసి నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం అవకాశం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి: ఎమ్మెల్యే వంశీకృష్ణ


35వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, జూలై 12: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్, జోనల్ అధికారులతో కలసి సమష్టిగా కృషి చేస్తానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రేటర్ 35వ వార్డు పరిధిలో వెలంపేట, గాజులవీధి, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి, పలు మురికివాడ ప్రాంతాల్లో కార్పొరేటర్ విల్లూరి భాస్కర్, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జోనల్ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల అధ్వాన పరిస్థితి తదితర సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు తదితర సంక్షేమ పథకాల్లో కోత కోసినట్టు వాపోయారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించి, ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చొరవ చూపాలని జోనల్ కమిషనర్ ప్రసాద్‌ను ఆదేశించారు. వార్డుల్లో పారిశుధ్యం కల్పనలో జాగ్రత్తగా తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బొచ్చా రామిరెడ్డి, జనసేన నాయకులు, భారీ సంఖ్యలో కూటమి శ్రేణు లు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి దుర్గాలమ్మను దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు.

కీటక జనిత వ్యాధులు రాకుండా చర్యలు

» డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


ట్యాంక్‌లో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సీతమ్మధార, జూలై 12: వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఇసుకతోట రామాలయం వీధిలో చేపడుతున్న జాతీయ ఆరో గ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఎన్‌ఎంఎస్, ఆశ కార్యకర్తలు, సూపర్ వైజర్లు సర్వే చేసి గర్భిణులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యాధికారులను కోరారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పరిసర ప్రాంతాల్లో ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి వాటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగభూషణం, ఎంపీహెచ్‌ఈవో, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్ల సదస్సు


సదస్సులో చార్టర్డ్ అకౌంటెంట్లు

సిరిపురం, జూలై 12: చార్టర్డ్ అకౌంటెంట్లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఎస్ఐఆర్‌సీ విశాఖ బ్రాంచి ఆధ్వర్యంలో ఐసీఏఐల సమక్షంలో ధృతి పేరిట వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఏర్పాటుచేసిన సదస్సును శుక్రవారం సంస్థ విశాఖ చైర్మన్ సీఏ అనిర్బన్‌పాల్ ప్రారంభించారు. ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్ సీఏ గీతా ఏబీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వతంత్రంగా ఆలోచించే అంశాలను ప్రస్తావించారు. అనిర్బన్‌పాల్ మాట్లాడుతూ.. చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిని మెరుగుపరుచుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ డి.ప్రసన్నకుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు, వైస్ చైర్మన్ సీఏ శ్రీధర్, పి. లోకేష్, కోశాధికారి స్వరూప్, ఎడిటర్ వాసుదేవమూర్తి, ప్రశాంత్, ఎస్ఐఆర్‌సీ కోర్ కమిటీ సభ్యులు ఎస్. రఘునాథన్, శ్రీధర్ ముప్పాల, ఎం. సునీల్‌కుమార్, గురురాజ్ ఆచార్య, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి సీఏలు హాజరయ్యారు.

సకాలంలో ఇంజనీరింగ్ ప్రవేశాలు

... 3వ పేజీ తరువాయి

ఫీజుగా రూ.45 వేలను కొనసాగించాలి. కానీ, ఉన్నత విద్యాశాఖ అందుకు విరుద్ధంగా కనిష్ఠ ఫీజును రూ.40 వేలకు కుదిస్తూ జీవో జారీచేసింది. దీనిపై కనిష్ఠ ఫీజు జాబితాలో ఉన్న కాలేజీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ, ప్రైవేటు కాలేజీలు మధ్య వివాదం నడుస్తోంది. అయితే ఇది రిజిస్ట్రేషన్స్‌పై ప్రభావం చూపించదని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి.

చంద్రబాబు చొరవతో సబ్సిడీపై నిత్యావసరాలు

» ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

» రైతుబజారుల్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం విక్రయాలు


రాయితీ బియ్యం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జూలై 12: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు చౌక నిత్యావసరాలు అందించాలనే లక్ష్యంతో రాయితీపై బియ్యం, కంది పప్పు పంపిణీ చేస్తున్నట్టు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. సీతమ్మధారలోని రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు స్టాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బియ్యం కిలో రూ.49కు కందిపప్పు కిలో రూ.160లకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సీతమ్మధార రైతుబజార్‌ని ఒక మోడల్ రైతు బజార్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎస్ఓ ప్రకాష్, ఆర్ఐ ఎం.అశోక్, ఏపీ స్టేట్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు గన్ని వీరన్న చౌదరి, విశాఖ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యసాగర్, వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, కూటమి నాయకులు సురేష్ బాబు, బర్ల పద్మలత, హేమ, బర్ల బాలకృష్ణ, అడబాల నాని, అడబాల లక్ష్మి, నమ్మి రవికుమార్, గొంప ధర్మారావు, వసంతరావు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: నరసింహనగర్‌లోని రైతుబజారులో సబ్సిడీ కందిపప్పు, సన్నబియ్యం విక్రయాల స్టాల్‌ను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లలో బియ్యం, కందిపప్పు ధరలు ఎక్కువగా ఉండడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుబజార్లలో సబ్సిడీతో కూడిన కందిపప్పు, బియ్యం కౌంటర్లను ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాల నాయుడు, సివిల్ సప్లయిస్ ఆర్ఐ మురళీ కృష్ణ, రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు సత్యనారాయణ, స్టాల్ అధినేతలు లాడి చంద్రశేఖర్, మణికంఠ, నాయకులు భరణికాన రాజు, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజారులో రాయితీపై బియ్యం, కందిపప్పు వి క్రయాలను ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా నేరుగా ఆయన వినియోగదారులకు సరకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బజారు ఎస్టేట్ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి, కుట్టా కార్తీక్, రంగుముద్ర రాంబాబు, ఉప్పాడ శేఖర్, సత్యారావు, ఆదిబాబు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ కింగ్స్‌పై వైజాగ్ వారియర్స్ గెలుపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 12: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా శుక్రవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన క్వాలిఫైర్-2 మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ ఏడు పరుగుల తేడాతో రాయలసీమ కింగ్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 190 పరుగులు చేసింది. అశ్విన్ హెబ్బర్ (81 నాటౌట్; 3 బౌండరీలు, 6 సిక్సర్లు). కెప్టెన్ శ్రీకర్ భరత్ (53; 1 బౌండరీ, 6 సిక్సర్లు) చెలరేగి హాఫ్ సెంచరీలు సాధించగా.. ముప్వల యువన్ (24) రాణించాడు. రాయలసీమ బౌలర్లలో గిరినాథరెడ్డి, ఆంజనేయులు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 191 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ చివరి వరకు పోరాడి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 183 పరుగులు చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. డీబీ ప్రశాంత్‌కుఆమార్ (17), రోషన్‌కుమార్ పవ్ (19), వినయ్య (21), గుత్తా రోహిత్ (44; 4 బౌండరీలు, 2 సిక్సర్లు), కెప్టెన్ గిరినాథరెడ్డి (27), కమరుదీన్ (22), శ్రావన్ (19నాటౌట్) రాణించినా ఫలితం లేకపోయింది. వైజాగ్ వారియర్స్‌లో సుదర్శన్ రెండు వికెట్లు తీయగా రామ్, మల్లికార్జున, యశ్వంత్, గంగాధర్, మనోహర్ తలో వికెట్లు పడగొట్టారు. అశ్విన్ హెబ్బర్ మ్యాన్ ఆఫ్ ద ప్లెయిర్‌గా నిలిచాడు.

లక్ష్మీపార్వతి నియామకాన్ని రద్దు చేయాలి


నిరసన చేపడుతున్న ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు

వెంకోజీపాలెం, జూలై 12: ఏ యూ తెలుగు డి పా ర్ట్‌మెంట్ గౌరవ ప్రొఫెసర్ లక్ష్మీపార్వతి నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగు విభాగం వద్ద ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడు తూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి హ యాంలో జరిగిన అక్రమాలు త వ్విన కొద్దీ వెలుగులోకి వస్తున్నాయని, అందులో భాగంగానే లక్ష్మీపార్వతి నియామకం కూడా అని చెప్పారు. తక్షణమే ఆమె నియామకాన్ని రద్దు చేయడంతో పాటు ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాస్, డాక్టర్ సూరి, మంజుల, భాను తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

... 3వ పేజీ తరువాయి

వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించనున్నట్టు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారని తెలిపారు.

విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డు అభివృద్ధికి ఆదేశం

దశల వారీగా తీరం వెంబడి శ్రీకాకుళం జిల్లా మూలపేట వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదిస్తున్నామని, దీనిలో భాగంగా విశాఖ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డును మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారన్నారు. పర్యాటకాభివృద్ధిలో విశాఖ-భీమిలిబీచ్‌రోడ్డు ప్రధాన భూమిక పోషిస్తుందని పేర్కొన్నట్టు వివరించారు. బీచ్‌రోడ్డుకు జాతీయ రహదారికి నడుమ ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక లింకు రోడ్డునిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారని కలెక్టర్ తెలిపారు.

విశాఖ తీరంలో సీఆర్‌జడ్-3లో ఉన్న ప్రాంతాలను సీఆర్‌జడ్-2కు మార్చాలని పలువురు ఎమ్మెల్యేలు చేసిన ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఆదేశించారన్నారు. తీరంలో ఎక్కువ ప్రాంతం జీవీఎంసీ పరిధిలో ఉన్నందున సీఆర్‌జడ్‌లో క్లాసిఫికేషన్ మార్పు చేయాలని కోరడంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పినట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేయాలన్న సీఎం ఆదేశాల మేరకు వచ్చే వారం భేటీ కానున్నట్టు తెలిపారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, అందుకే అమరావతి, పోలవరం తరువాత విశాఖ పర్యటనకు వచ్చినట్టు సీఎం చెప్పారన్నారు.

నగరంలో ఫ్లైఓవర్లకు ప్రత్యామ్నాయంగా 2 ఎలివేటెడ్ కారిడార్లు

... 3వ పేజీ తరువాయి

సమీక్షలో నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేలు కోరారు. ఆనందపురం నుంచి విశాఖ నగరం, గాజువాక మీదుగా అనకాపల్లి వరకు ఉన్న జాతీయ రహదారికి మరమ్మతులు చేసి ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి ఫ్లైఓవర్లు నిర్మించి జీవీఎంసీకి అప్పగించాలని జాతీయ రహదారుల సంస్థను చాలాకాలంగా జిల్లా యంత్రాంగం కోరుతోంది. భారీ వాహనాలు చాలావరకూ ప్రస్తుతం ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా అనకాపల్లి వెళుతున్నాయి.

ఇటు ఆనందపురం మండలం గంభీరం నుంచి లంకెలపాలెం వరకూ దాదాపు 30 ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. ఈ మార్గంలో కొమ్మాది, కారుషెడ్ జంక్షన్, హనుమంతువాక, ఇసుకతోట, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, మురళీనగర్, షీలానగర్, గాజువాక పోలీస్ స్టేషన్, స్టీల్‌ప్లాంట్ జంక్షన్, లంకెలపాలెం జంక్షన్‌లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్నట్టు తేల్చారు. అయితే ప్రతి జంక్షన్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడం సాధ్యంకాదని, ఎక్కువ ట్రాఫిక్‌జామ్ అవుతున్న సుమారు 12 జంక్షన్‌లను గుర్తించారు. అయితే ఎనిమిది జంక్షన్లలను కలుపుతూ ఒక ఎలివేటెడ్ కారిడార్, మరో నాలుగు జంక్షన్‌లను కలుపుతూ ఇంకొక ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని జాతీయ రహదారుల సంస్థకు చంద్రబాబు సూచించారు. దీనిపై సమగ్రంగా నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ల కంటే ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణానికి ఖర్చు ఎక్కువైనా వాటి వల్ల సమయం ఆదా అవుతుందని చెప్పడంతో అందుకు తగిన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు అంగీకరించారు. ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణం కోసం కిలోమీటర్లకు రూ.125 కోట్లు అవుతాయని పేర్కొన్నారు. త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్రం నుంచి అనుమతులు తీసుకుంటామని సీఎం చెప్పడంతో అందుకు సంబంధిత ప్రతినిధులు అంగీకరించారు.

హయగ్రీవ పనులకు బ్రేక్

... 3వ పేజీ తరువాయి

కోర్టు సూచించింది. ఆ తరువాత జీవీఎంసీ అధికారులు ఏయే పత్రాలు సమర్పించాలో సూచిస్తూ షార్ట్ ఫాల్ నోటీసు ఇచ్చారు. కలెక్టర్ కూడా ఈ కేసులో ఎన్‌ఓసీ అవసరం లేదని స్పష్టంచేశారు. ఇదే సమయంలో దీనిపై పల్లా శ్రీనివాసరావు, పీతల మూర్తియాదవ్ కోర్టులో కేసు వేయడంతో జీవీఎంసీ కమిషనర్ న్యాయ సలహా కోరారు. మరోవైపు ఈ భూమిపై జీపీఏ పొందిన జి.వెంకటేశ్వరరావు ఆన్‌లైన్‌లో మరోసారి ప్రతిపాదనలు సమర్పించారు. దాంతో కలెక్టర్ ఆ ప్లాన్ ప్రతిపాదనలను హోల్డ్‌లో ఉంచి దానికి సంబంధించిన అభ్యంతరాలు ఏమైనా ఉంటే పరిశీలించాలని ఆదేశించారు. జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ దీనిపై ఎటువంటి ఇంటెరిం ఆర్డర్లు అమలులో లేవని, నిర్మాణానికి అనుమతించవచ్చునని, అయితే రిట్ పిటిషన్ 160/2022, 191/2022ల తీర్పులకు లోబడి ఉండాలని సూచించింది. ఈ మేరకు నిర్మాణానికి అనుమతించారు. అయితే హయగ్రీవ యజమాని అయిన జగదీశ్వరుడు జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి యాజమాన్య హక్కులపై వివాదం తలెత్తినందున అనుమతులన్నీ అబెయెన్స్‌లో పెట్టాలని కోరారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించి, బిల్డింగ్ ప్లాన్ అనుమతిని రద్దు చేయాలని, ఇది తన స్వప్రయోజనాల కోసం కాదని, నేషనల్ జస్టిస్ కోసం కోరుతున్నానన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకోవాలని, అంతవరకూ పనులు ఆపేయాలని సూచిస్తూ జీవీఎంసీ కమిషనర్ నాలుగు రోజుల క్రితం ఆదేశాలు ఇచ్చారు.

ధరలకు కళ్లెం

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వ ఆదేశాలతో పౌర సరఫరాల శాఖ అధికారులు రంగంలోకి దిగి తొలుత హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. బహిరంగ మార్కెట్‌తో పోల్చితే బియ్యం కిలోకు రూ.ఏడు నుంచి రూ.17 వరకు, కందిపప్పుపై రూ.20 నుంచి రూ.30 తక్కువకు ప్రభుత్వం అందిస్తోంది. వినియోగదారుల సౌకర్యార్థం కౌంటర్ల సంఖ్యను పెంచడంతోపాటు మరికొన్ని నిత్యావసరవస్తువులను అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచనలో పౌర సరఫరాల శాఖ ఉంది. ప్రస్తుతం ప్రతి కౌంటర్‌లో ఒక్కొక్కరికి 25 కిలోల వరకు బియ్యం, కిలో కందిపప్పు అమ్ముతున్నట్టు డీఎస్‌వో వివరించారు. కాగా శుక్రవారం సీతమ్మధార రైతుబజార్‌లోకౌంటర్‌ను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జేసీ మయూర్ అశోక్,ఎంవీపీకాలనీలోఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, జూలై 12: నిర్వహణ పనులు చేపడుతున్నందున చిన గంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-2 ఈఈ బీకె నాయుడు పేర్కొన్నారు. చినగంట్యాడ, చైతన్యనగర్, డ్రైవర్స్ కాలనీ, ఆర్‌కే ఆస్పత్రి, శ్రామికనగర్, శ్రీనివాసనగర్, దత్త సాయినగర్, టీవీఎస్ కాలనీ, కుంచుమాంబకాలనీల పరిధిలో సరఫరా ఉండదన్నారు.

మల్కాపురం పరిధిలో...

మల్కాపురం: మరమ్మతులు నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్ 2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. త్రినాథపురం, మల్కాపురం, వాటర్ వర్క్స్, షిప్‌యార్డు-1,2, బీపీసీఎల్, ఎంకేపీ ఆయిల్ ఫీడర్ల పరిధిలో సరఫరా ఉండదన్నారు.

గోపాలపట్నం పరిధిలో...

గోపాలపట్నం: నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సుసర్లాకాలనీ, సీతారామరాజు నగర్, బాజీ జంక్షన్, రెడ్డి వీధి, ఎస్సీ కాలనీ, విద్యానగర్, నాయుడు క్వార్టర్స్ రైల్వే స్టేషన్ ఏరియా, గాంధీ నగర్, గవర వీధి, ఇందిరి ప్రియదర్శిని కాలనీ, ఎస్‌ఏడీ ఎస్సీ కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

అక్కిరెడ్డిపాలెం పరిధిలో...

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్ 2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. షీలానగర్, వెంకటేశ్వర కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, గవర జగ్గయ్యపాలెం, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి పరిధి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పోర్టు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

చెరువు ఆధునికీకరణ పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, జూలై 12: నాతయ్యపాలెంలో కృష్ణమహంతి చెరువు ఆధునికీకరణతోపాటు మోడ్రన్ లైటింగ్ పనులను శుక్రవారం కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. సర్వాంగ సుందరంగా చెరువును తీర్చిదిద్దడంతో నాతయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీల ప్రజలు వాకింగ్, పిల్లలు ఆడుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. పనులను సత్వరం పూర్తిచేసి పార్కును స్థానికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు ఎంపిక

మల్కాపురం, జూలై 12: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అల్లు జశ్వంత్ కుమార్, దళాయి శ్రీసాంత్‌కు నూజివీడు, భగత హర్షిత, నిఖిల్‌కు శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు దక్కినట్టు ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.

పుస్తకాల పంపిణీ

పెందుర్తి, జూలై 12: చినముషిడివాడ శాంతినగర్ పాఠశాలలో శుక్రవారం పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ శేనాపతి వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

‘సత్యసాయి సమితి సేవలు ఆదర్శం’

గాజువాక, జూలై 12: సత్యసాయి సమితి అందిస్తున్న సేవలు ఆదర్శమని రాయ్‌పూర్ అమిటీ యూనివర్సిటీ డైరెక్టర్, ఆధ్యాత్మికవేత్త శివమ్ అరుణ్‌కుమార్ పట్నాయక్ అన్నారు. గాజువాక గొంతినవానిపాలెం సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సేవలో ఉన్న ఆనందం మరెందులోనూ ఉండదన్నారు. గొంతినవానిపాలెం మండలి ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం మానసిక వైద్యశాలలోని 300 మంది రోగులకు, ప్రతి సోమవారం కోరమాండల్ సమీపంలోని జీవీఎంసీ ఆస్పత్రి వద్ద 60 మందికి ఆహారం అందించడాన్ని కొనియాడారు. భజన మండలి కన్వీనర్ ఎస్.ఆదిరెడ్డి, ప్రతినిధులు సీహెచ్ భాస్కరరావు, రామారావు, జ్యోతి, నరవ శ్రీనివాస్, పద్మరాజు, గంగవరం గోపి పాల్గొన్నారు.


పెదగంట్యాడ రోడ్డులో ఇలా...


ఆటోనగర్ సమీపంలో రహదారి పక్కనే...


యాతపాలెం రోడ్డు పక్కన ఫ్యూజ్‌బాక్స్...

ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు

- రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు
- భయాందోళనలో స్థానికులు

పెదగంట్యాడ, జూలై 12: పారిశ్రామిక వాడలోని రహదారుల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అమర్చిన విద్యుత్ ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా మారాయి. వీటికి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో స్థానికులు ఉన్నారు. పారిశ్రామిక వాడ ప్రధాన రహదారిలో పక్కన ఉన్న రెండు, యాతపాలెం నుంచి పెదగంట్యాడకు వెళ్లే పారిశ్రామికవాడ రోడ్డు పక్కన ఒకటి ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటికి ఎలాంటి రక్షణ పరికరాలు, డోర్లు ఏర్పాటు చేయలేదు. అంతేకాదు పెదగంట్యాడ ఆటోనగర్‌లోని మరికొన్ని రహదారుల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. కాగా పారిశ్రామిక వాడకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు కావడంతో వీటికి ఎక్కువ వోల్టేజీతో ఉంటుంది. ఫ్యూజుబాక్సులు నేలకు నాలుగు అడుగుల ఎత్తులో ఉండడం, వాటి వద్ద రక్షణ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చిన్నారులు, ఆకతాయిలు వీటివద్దకు వెళ్తే ప్రమాదం జరుగుతుందని భయపడుతున్నారు. పెదగంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరువలోనే ఈ పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



పారిశ్రామికవాడలోని అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజు బాక్సులకు రక్షణ చర్యలు చేపట్టాలి. డోర్‌లు వేయాలి. రోడ్డున పోయేవారు, చిన్న పిల్లలకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలి.

\- సంపంగి ఈశ్వరరావు, యాతపాలెం

రాయితీ ధరకే కందిపప్పు, బియ్యం

- పశ్చిమ, పెందుర్తి ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల
- రైతుబజార్లలో విక్రయ కేంద్రాలు ప్రారంభం

మల్కాపురం, జూలై 12: ప్రజలకు నాణ్యమైన నిత్యావసరాలు సరసమైన ధరకే ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న రైతుబజారులో శుక్రవారం సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధర ఎక్కువగా ఉన్నందున సబ్సిడీపై ప్రభుత్వం వీటిని అందిస్తోందని వివరించారు. కిలో కందిపప్పు రూ.160కి, బియ్యం కిలో రూ.49కి సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. రైతుబజారు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం రైతుబజారును పరిశీలించారు. సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, శీరం ఉమామహేశ్వరి, నక్కా లక్ష్మణరావు, మజ్జి సోమేష్, మాతా శ్రీను, కొరిబిల్లి రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతుబజారు ఆవరణలో ఉన్న ములగాడ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రాతో మాట్లాడారు. శాశ్వత భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. జింక్‌లో ఉన్న ప్రభుత్వ స్థలం, గాజువాక ఆర్టీసీ డిపో నుంచి శ్రీహరిపురం మార్గంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించాలని కోరారు.


ములగాడ రైతుబజారులో విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు


పెందుర్తి రైతుబజారులో స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి రైతు బజారులో...

పెందుర్తి: పెందుర్తి రైతుబజార్‌లో రాయితీ కందిపప్పు, బియ్యం విక్రయాలను శుక్రవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించారు. స్థానిక ఎస్టేట్ అధికారి వీఎస్‌పీ షర్మిల, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ మా జీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, 96వ వార్డు జనసేన అధ్యక్షుడు డీబీఎల్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, నీలంశెట్టి శివ అయిత సింహాచలం సహా యకులు చిన్నబ్బాయ్, రైతులు పాల్గొన్నారు

పైపులైన్ల లీకులతో వృథాగా పోతున్న తాగునీరు

- శివారు ప్రాంత వాసులకు తప్పని ఇక్కట్లు
- చర్యలు చేపట్టని జీవీఎంసీ అధికారులు

గాజువాక, జూలై 12: పైపులైన్ల లీకుల నియంత్రణలో నిర్లక్ష్యం కారణంగా జోన్ పరిధిలోని అనేకప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతోంది. ఫలితంగా శివారు ప్రాంతాలకు అరకొరగా సరఫరా అవుతోంది. కొంతకాలంగా ఇదే పరిస్థితి ఎదురవుతున్నా, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టకపోవడం, కొత్తవి అమర్చకపోవడంతోపలు వార్డుల్లో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. అధికశాతం పైపులైన్ల కు లీకుల సమస్య ఉంది. ప్రధానంగా గాజువాక మునిసిపాలిటీగా ఉన్న సమయంలో తాగునీటి సరఫరా నిమిత్తం 20 ఏళ్ల క్రితం వేసిన వాటర్ పైపులైన్ల నుంచే ఇప్పటికీ నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పైప్‌లైన్లలో అత్యధికశాతం తుప్పుపట్టి పాడయ్యాయి. పైపులకు పెద్దపెద్ద రంధ్రాలు పడి నీరంతా లీకయిపోతోంది. పైపులైన్లకున్న లీకులను నియంత్రించాలని పలు వార్డుల నుంచి ఫిర్యాదువెళ్తున్నాయి. కొత్త పైపులైన్లు మార్చుతామని అధికారులు చెబుతున్నా ఆచరణకు నోచుకోలేదు.



కణితి రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు

లీకుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ప్రధాన పైపులైన్లతోపాటు ఇళ్లకు వేసిన కొళాయిలకు లీకులను ని యంత్రిస్తే పుష్కలంగా తాగునీరు సరఫరా అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సరఫరా అవుతున్న నీటి కంటే వృథాగా బయటకు పోతోందే ఎక్కువగా ఉంటుందని, అధికారులు స్పందించి పైపులైన్లను మార్చాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకులు

- కూలిపోయే స్థితికి చేరడంతో స్థానికుల ఆందోళన
- శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీటి సరఫరా


యాతపాలెం, సిద్దార్థనగర్‌లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులు

కూర్మన్నపాలెం, జూలై 12: జీవీఎంసీ 86 వార్డు రాజీవ్ నగర్, యాతపాలెం, 87 వార్డు సిద్దార్థ నగర్‌లల్లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆ ట్యాంకులపైకి వెళ్లేందుకు, దిగడానికి వీలుకాని పరిస్థితి. దీంతో ఎన్నో ఏళ్లుగా ట్యాంక్‌లు శుభ్రపరచడంలేదు. దీంతో కుళాయిలనుంచి వస్తున్న తాగునీటిలో చెత్తా చెదారం, నలకలు, బురద వస్తుందని ఉడానగర్, రాజీవ్ నగర్, యాతపాలెం వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సురక్షిత నీటి సరఫరా అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కలుషితమైన తాగునీటిని తాగి వ్యాధుల బారిన పడతామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సిద్దార్థ నగర్‌లో శిథిలావస్థ వాటర్ ట్యాంకును ఇటీవలే వార్డు కార్పొరేటర్ బొండా జగన్ నీటి విభాగ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో కొత్తది నిర్మించాలని ఆయన కోరారు. అలాగే, ట్యాంకులను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరటంతో, ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని జగన్ హామీ ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

పెదగంట్యాడ, జూలై 12: పరిశుభ్రత ప్రజల ధ్యేయం కావాలని గాజువాక జోన్ ఏఎంహెచ్‌ఓ కిరణ్‌కుమార్ అన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు నెల్లిముక్కు రామాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పరిశుభ్రత పాటించాలన్నారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.నగేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి

సింధియా: స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న పిలుపునిచ్చారు. క్రాంతినగర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజారోగ్య అవగాహనా కార్యక్రమంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణకు పరిశుభ్రతా నియమాలు పాటించాలన్నారు. ఏఎంహెచ్‌ఓ సునీల్‌కుమార్, ఎస్ఏస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

ఉక్కుటౌన్‌షిప్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను నియంత్రించవచ్చునని సీనియర్ ఎంటమాలజిస్టు వరహాల దొర అన్నారు. డెంగ్యూ నియంత్రణ మాసోత్సవాల సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం టౌన్‌షిప్‌లో అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా దోమల ద్వారానే వ్యాపిస్తాయన్నారు. స్టీల్‌ప్లాంట్ పబ్లిక్ హెల్త్ స్టాఫ్ చంద్రశేఖర్, చలపతి, మనోహర్ పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం

కూర్మన్న పాలెం: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. చిన్నారులకు వేడిగా ఉండే ఆహారం అందించాలన్నారు. వేడి చేసి చల్లార్చిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలన్నారు. పరిశుభ్రతతో వ్యాధులను తరిమి కొట్టవచ్చని తెలిపారు. ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, అప్పారావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

అగనంపూడి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 85వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య సూచించారు. కొండయ్యవలస, గెంజిపేటలలో శుక్రవా రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటి నిల్వ లు లేకుండా చూసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా జీవీఎంసీ సిబ్బందికి అందజేయాలన్నారు. రౌతు మూర్తి, బుదిరెడ్డి అప్పారావు, డొక్కా రమేశ్, కోసూరి తాతారావు, పైడి రత్నం పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన

గోపాలపట్నం: సీజనల్ వ్యాధులపై సత్తివానిపాలెం డ్వాక్రా మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలను వివరించారు. కలుషిత నీటితో డయేరియా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: సీజనల్ వ్యాధులపై స్థానిక ఉన్నత పాఠశాలలో మలేరియా విభాగం అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. నీటి నిల్వలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.వి.సత్యానంద్, హెల్త్ అసిస్టెంట్ గంటల కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నెలిముక్కులో అవగాహన కల్పిస్తున్న అధికారులు


క్రాంతినగర్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ చిన్న


డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరశురామావతారంలో జగన్నాథుడు


పరశురామావతారంలో జగన్నాథస్వామి

అగనంపూడి, జూలై 12: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామి శుక్రవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువుదీరిన జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి ఆలయ మేనేజర్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిరూరల్: మండలంలోని చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని గోపాలకృపాలయంలో శుక్రవారం జగన్నాథుడు పరశురామావతారంలో దర్శనమిచ్చారు. కరుణా నిమాయిదాస్ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు.

‘ఐక్య పోరాటాలతోనే విజయం’

కూర్మన్నపాలెం, జూలై 12: ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరం శుక్రవారం నాటికి 1247 రోజులకు చేరుకొంది. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమార స్వామి స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రణాళిక రూపొందించేందుకు, పరిస్థితిని చక్కదిద్దేందుకు 45 రోజులు సమయం పడుతుందని తెలిపారన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా ఆయన ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజల ఆత్మ గౌరవమైన ఉక్కును కాపాడుకోవడమే కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రక్రియను రద్దుచేసే వరకు పోరాటం ఆగదన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

వేపగుంట జూలై 12: రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 93వ వార్డులో రూ.1.93కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవస్థానం భూములు, తాడి గ్రామం తరలింపుపై త్వరలో చర్యలు చేపట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబుకు దృష్టికి తీసుకువెళ్లామని, దీనిపై అందరితో సమావేశం నిర్ణయించి పక్కా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. బాలాజీ గార్డెన్‌లో రూ.19.6 లక్షలతో రెండు పార్కులు, నార్త్‌బాలాజీ గార్డెన్స్‌లో రూ.9.23లక్షలు, సాయిదుర్గానగర్ గెడ్డపై వంతెనకు రూ.19.లక్షలతోను, విరాట్‌నగర్‌లో రూ.19.9లక్షలతో డ్రైన్, ప్రహరీ, శ్రీనివాసనగర్‌లో కాలువ, గొల్ల నారాయణపురంలో రూ.19.85లక్షతో కాలువ, ప్రహ్లాదపురంలో రూ.16.45లక్షలతో సీసీరోడ్డు, ఈస్ట్ పాయింట్‌కాలనీ గెడ్డ కల్వర్టు నిర్మాణం తదితర పనులకు కార్పొరేటర్ రాపర్తి కన్నాతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ కె.హైమావతి, ఈఈ రత్నకర్, డీఈ విజయకుమార్, ఏఈ రాజశేఖర్, టీడీపీ నేతలు గంగ వరహాలు, కోట్ని వాసు, ఆదిబాబు, పురుషోత్తం బంటు సురేష్, వెంకటేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం’

గాజువాక, జూలై 12: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విషయంల ప్రధానమంత్రితో మాట్లాడలేదని ఆరోపించారు. ప్లాంట్‌కు అతి త్వరలోనే మంచి రోజులు రానున్నాయన్నారు. సమావేశంలో నమ్మి సింహాద్రి, గడసాల అప్పారావు, గందం వెంకటరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్‌కుమార్, గుమ్మడి నరేంద్ర, రామస్వామి,అప్పారావు, అరుగుల మణికుమార్, పెద్దాడ సోమినాయుడు, పులి రమణారెడ్డి, ఉగ్రం పాల్గొన్నారు.

పూర్వ హెచ్‌ఎం శివాజీకి ఘన నివాళి

పెందుర్తి రూరల్, జూలై 12: చింతలఅగ్రహారం ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచిన పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎ.వి.ఎస్. శివాజీ జయంతిని శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. హెచ్.ఎం. నాగమణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, శివాజీ కుటుంబ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచులు ఆళ్ల తాతారావు, పి.వెంకటరమణ, పి.అప్పారావు, డబ్బీరు వెంకటరావు, మద్దాల శ్రీనివాసరావు శివాజీ సేవలను కొనియాడారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శివాజీ సతీమణి విశాలి రూ.10 వేలు బహుమతిగా అందించారు.


శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాగునీటి బోర్లు ప్రారంభం

పెందుర్తి, జూలై 12: గ్రేటర్ 96 వార్డు పరిధి పెందుర్తి పరిధి జేఎన్‌ఎన్‌యూఆర్ఎం, సాయిదివ్య, దుర్గాఆదర్శ్‌నగర్ కాలనీలు, వెలంపేటలలో తాగునీటి బోర్లను శుక్రవారం జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు చేశారు. వార్డు పరిధిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ నిధులతో ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజేంద్రప్రసాద్, కిల్లి రమేశ్, ఆళ్ల రమేశ్, పీలా జితేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం

కూర్మన్నపాలెం, జూలై 12: జీవీఎంసీ 87 వార్డు తిరుమలనగర్‌లో కాలనీ వాసులు శుక్రవారం ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం సందర్భంగా ర్యాలీనిర్వహించారు. ప్లాస్టిక్‌ను నివారించాలని, పేపర్ బ్యాగులు, స్టీలుగిన్నెలు, జూట్, క్లాత్ బ్యాగులు వాడాలని నినాదాలు చేశారు. పరమానందం, విశ్వేశ్వరరావు, నాగభూషణం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

అక్కిరెడ్డి పాలెం, జూలై 12: పర్యావరణ పరిరక్షణతోనే భావి తరాలకు ఆరోగ్య సమాజాన్ని అందించగలమని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం ఎల్ఎస్ కాంతం అన్నారు. హెచ్‌పీసీఎల్, మిలీనియం ప్లస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ మేనేజర్ టీడీ రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించడంతో పాటు ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ఎ.రవికుమార్, ఎస్.హరీష్, పి.రాజారావు, ఉపాధ్యాయులు బి.రవిచంద్, కుమారస్వామి, దేముళ్ల తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సినిమా గైడ్

- **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలిస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి).
- **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)


ఉల్లిపాయలు 37, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 40, బీరకాయలు 32, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 42, క్యాబేజి 32, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 30, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 120, అల్లం 140, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి 180, కొబ్బరికాయ 23, బీన్స్ (పెన్సిల్) 106, పొటల్స్ 40, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు



బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారుడి దంపతులకు సన్మాన దృశ్యం

సీతంపేట, జూలై 12: కళాకారులను ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో మారుతి నాయీ బ్రాహ్మణ డోలు, సన్నాయి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డోలు వాద్యంలో ఆల్ ఇండియా రేడియా ద్వారా ఏ గ్రేడ్ కళాకారుడు కె.గోవిందరావుకు సన్మానం శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. బీమారావు, జి.శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, బాలరాజు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షులు సీహెచ్‌వీ సత్యనారాయణ,నాదశ్వర డోలు కళాకారులు పాల్గొన్నారు.



ముస్తాబవుతున్న మాధవస్వామి మందిరం



సింహాచలం చేరే కొండ మెట్ల వద్ద మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

మాధవధారలో గురుపౌర్ణమికి ఏర్పాట్లు

» సింహాచలం గిరి ప్రదర్శనకు వీలుగా సౌకర్యాలు

మురళీనగర్, జూలై 12 ; గురుపౌర్ణమి రోజు (ఈనెల 21న) సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీ నృసింహస్వామి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ముందురోజు 20వ తేదీన నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సింహగిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సింహాచలం దేవస్థానం అధికారులు, జీవీఎంసీ అధికారుల సమన్వయంతో ఈ ఏర్పాట్లు ప్రారంభించారు. శుక్రవారం మాధవధార పుణ్యక్షేత్రంలో ప్రాచీన శ్రీ మాధవస్వామి మందిరం, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున, వేణుగోపాల స్వామి ఆలయాల వద్ద పలు ఏర్పాట్లు చేస్తున్నారు. స్నానాల ఘాట్ వద్ద గిరి ప్రదక్షిణ రోజు, మరుసటి రోజు గురుపౌర్ణమి రోజున పుణ్య స్నానాలకు వచ్చే వేలాది భక్తుల కోసం వసతులు కల్పిస్తున్నారు.

అద్దంలా కొండ మార్గం

గురు పౌర్ణమి వేడుకల నేపథ్యంలో ఇప్పటికే జీవీఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇక్కడినుంచి సింహాచలం కొండకు చేరే దారి, అక్కడి నుంచి మెట్ల మార్గం పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. అలాగే తాత్కాలిక టాయిలెట్‌లు, తాగునీటి వసతులతో పాటు అత్యవసర వైద్య సదుపాయాలకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

ప్రేమ సమాజాన్ని సందర్శించిన న్యాయమూర్తి



పిల్లలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

డాబాగార్డెన్స్, జూలై 12: డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ శుక్రవారం సందర్శించారు. అక్కడ ఉన్న వృద్ధులు, పిల్లలతో మాట్లాడి వసతి, భోజన సదుపాయాలను అడిగి తెలుసుకుని తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యకమంలో జి.స్వర్ణ, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన ఓకార్యక్రమంలో పీఎల్‌ఏపీయూఎస్ చైర్మన్ జి.వల్లభనాయుడు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించారు. హెల్మెట్ లేకుంటే శిక్షార్హనేరమని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ. 2.4 లక్షల జరిమానా

కొమ్మాది, జూలై 12: విశాఖ నార్త్‌జోన్ ట్రాఫిక్ సర్కిల్ స్టేషన్ల పరిధిలో నమోదైన వివిధ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు న్యాయస్థానం రూ. 2.70 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఎస్. కాంతారావు శుక్రవారం తెలిపారు. పీఎంపాలెం స్టేషన్ పరిధిలో 28 మందికి రూ. 47వేలు, ఆనందపురం పరిధిలో పలువురికి రూ. 90వేలు, భీమిలి పరిధిలో 14 మందికి రూ. 1.40 లక్షలు న్యాయస్థానం జరిమానా విధించినట్లు తెలిపారు.

అక్కయ్యపాలెం, జూలై 12: నాల్గో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించిన ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ తెలిపారు. రూ.2వేల నుంచి 9వేల వరకు మొత్తం రూ.35వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి: ఎమ్మెల్యే వంశీకృష్ణ



35వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్ణామార్కెట్, జూలై 12: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్, జోనల్ అధికారులతో కలసి సమష్టిగా కృషి చేస్తానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రేటర్ 35వ వార్డు పరిధిలో వెలంపేట, గాజులవీధి, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి, పలు మురికివాడ ప్రాంతాల్లో కార్పొరేటర్ విల్లూరి భాస్కర్, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జోనల్ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల అధ్వాన పరిస్థితి తదితర సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు తదితర సంక్షేమ పథకాల్లో కోత కోసినట్టు వాపోయారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించి, ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చొరవ చూపాలని జోనల్ కమిషనర్ ప్రసాద్‌ను ఆదేశించారు. వార్డుల్లో పారిశుధ్యం కల్పనలో జాగ్రత్తగా తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బొచ్చా రామిరెడ్డి, జనసేన నాయకులు, భారీ సంఖ్యలో కూటమి శ్రేణు లు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి దుర్గాలమ్మను దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు.

కీటక జనిత వ్యాధులు రాకుండా చర్యలు

» డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



ట్యాంక్‌లో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సీతమ్మధార, జూలై 12: వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఇసుకతోట రామాలయం వీధిలో చేపడుతున్న జాతీయ ఆరో గ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీసీ వాక్సినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఎన్‌ఎంఎస్, ఆశ కార్యకర్తలు, సూపర్ వైజర్లు సర్వే చేసి గర్భిణులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యాధికారులను కోరారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పరిసర ప్రాంతాల్లో ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి వాటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగభూషణం, ఎంపీహెచ్‌ఈవో, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్ల సదస్సు



సదస్సులో చార్టర్డ్ అకౌంటెంట్లు

సిరిపురం, జూలై 12: చార్టర్డ్ అకౌంటెంట్లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఎస్ఐఆర్‌సీ విశాఖ బ్రాంచి ఆధ్వర్యంలో ఐసీఏఐల సమక్షంలో ధృతి పేరిట వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఏర్పాటుచేసిన సదస్సును శుక్రవారం సంస్థ విశాఖ చైర్మన్ సీఏ అనిర్బన్‌పాల్ ప్రారంభించారు. ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్ సీఏ గీతా ఏబీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వతంత్రంగా ఆలోచించే అంశాలను ప్రస్తావించారు. అనిర్బన్‌పాల్ మాట్లాడుతూ.. చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిని మెరుగుపరుచుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ డి.ప్రసన్నకుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు, వైస్ చైర్మన్ సీఏ శ్రీధర్, పి. లోకేష్, కోశాధికారి స్వరూప్, ఎడిటర్ వాసుదేవమూర్తి, ప్రశాంత్, ఎస్ఐఆర్‌సీ కోర్ కమిటీ సభ్యులు ఎస్. రఘునాథన్, శ్రీధర్ ముప్పాల, ఎం. సునీల్‌కుమార్, గురురాజ్ ఆచార్య. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి సీఏలు హాజరయ్యారు.

యూఎల్సీ సమస్య పరిష్కరించాలి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతి పత్రమిస్తున్న స్థానికులు

అక్కయ్యపాలెం, జూలై 12: గ్రేటర్ 44వ వార్డు రామచంద్రానగర్, శ్రీనివాసనగర్‌ల్లో గత 40 ఏళ్లగా నివశిస్తున్న తాము యూఎల్సీ 22ఏ సమస్య ఎదుర్కొంటున్నామని, దీనిని పరిష్కరించాలని ఆయా ప్రాంతాల్లోని కుటుంబాలు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మె ల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎవరైనా కొత్తగా ఇల్లు కొనాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. అలాగే, శాసనసభ సమావేశాల్లో చర్చించి త్వరగా పరిష్కార మ య్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అమ్మవారు

జగదాంబ కూడలి, జూలై 12: వన్‌టౌన్‌లోని బురుజుపేటలోని కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. నిత్యపూజల్లో భాగంగా ఉదయం 7 గంటల సమయంలో అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం సేవలను అర్చకులు ఉభయదాతలతో కలసి నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం అవ కాశం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంజనీరింగ్ ప్రవేశాలు

... 3వ పేజీ తరువాయి

ఫీజుగా రూ.45 వేలను కొనసాగించాలి. కానీ, ఉన్నత విద్యాశాఖ అందుకు విరుద్ధంగా కనిష్ఠ ఫీజును రూ.40 వేలకు కుదిస్తూ జీవో జారీచేసింది. దీనిపై కనిష్ఠ ఫీజు జాబితాలో ఉన్న కాలేజీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ, ప్రైవేటు కాలేజీలు మధ్య వివాదం నడుస్తోంది. అయితే ఇది రిజిస్ట్రేషన్స్‌పై ప్రభావం చూపించదని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి.

చంద్రబాబు చొరవతో సబ్సిడీపై నిత్యావసరాలు

» ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

» రైతుబజారుల్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం విక్రయాలు



రాయితీ బియ్యం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జూలై 12: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు చౌక నిత్యావసరాలు అందించాలనే లక్ష్యంతో రాయితీపై బియ్యం, కంది పప్పు పంపిణీ చేస్తున్నట్టు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. సీతమ్మధారలోని రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు స్టాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారరు. బియ్యం కిలో రూ.49కు కందిపప్పు కిలో రూ.160లకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సీతమ్మధార రైతుబజార్‌ని ఒక మోడల్ రైతు బజార్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎస్‌ఓ ప్రకాష్, ఆర్ఐ ఎం.అశోక్, ఏపీ స్టేట్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు గన్ని వీరన్న చౌదరి, విశాఖ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యసాగర్, వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి, కూటమి నాయకులు సురేష్ బాబు, బర్ల పద్మలత, హేమ, బర్ల బాలకృష్ణ, అడబాల నాని, అడబాల లక్ష్మి, నమ్మి రవికుమార్, గొంప ధర్మారావు, వసంతరావు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: నరసింహనగర్‌లోని రైతుబజారులో సబ్సిడీ కందిపప్పు, సన్నబియ్యం విక్రయాల స్టాల్‌ను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లలో బియ్యం, కందిపప్పు ధరలు ఎక్కువగా ఉండడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుబజార్లలో సబ్సిడీతో కూడిన కందిపప్పు, బియ్యం కౌంటర్లను ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాల నాయుడు, సివిల్ సప్లయిస్ ఆర్ఐ మురళీ కృష్ణ, రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు సత్యనారాయణ, స్టాల్ అధినేతలు లాడి చంద్రశేఖర్, మణికంఠ, నాయకులు భరణికాన రాజు, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజారులో రాయితీపై బియ్యం, కందిపప్పు వి క్రయాలను ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా నేరుగా ఆయన వినియోగదారులకు సరకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బజారు ఎస్టేట్ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి, కుట్టా కార్తీక్, రంగుముద్ర రాంబాబు, ఉప్పాడ శేఖర్, సత్యారావు, ఆదిబాబు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ కింగ్స్‌పై వైజాగ్ వారియర్స్ గెలుపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 12: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా శుక్రవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన క్వాలిఫైర్-2 మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ ఏడు పరుగుల తేడాతో రాయలసీమ కింగ్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 190 పరుగులు చేసింది. అశ్విన్ హెబ్బర్ (81 నాటౌట్, 3 బౌండరీలు, 6 సిక్సర్లు). కెప్టెన్ శ్రీకర్ భరత్ (53; 1 బౌండరీ, 6 సిక్సర్లు) చెలరేగి హాఫ్ సెంచరీలు సాధించగా.. ముప్పల యువన్ (24) రాణించాడు. రాయలసీమ బౌలర్లలో గిరినాథరెడ్డి, ఆంజనేయులు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 191 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ చివరి వరకు పోరాడి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 183 పరుగులు చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. డీబీ ప్రశాంత్‌కుఆమార్ (17), రోషన్‌కుమార్ పవ్ (19), వినయ్య (21), గుత్తా రోహిత్ (44; 4 బౌండరీలు, 2 సిక్సర్లు), కెప్టెన్ గిరినాథరెడ్డి (27), కమరుదీన్ (22), శ్రావన్ (19నాటౌట్) రాణించినా ఫలితం లేకపోయింది. వైజాగ్ వారియర్స్‌లో సుదర్శన్ రెండు వికెట్లు తీయగా రామ్, మల్లికార్జున, యశ్వంత్, గంగాధర్, మనోహర్ తలో వికెట్ల పడగొట్టారు. అశ్విన్ హెబ్బర్ మ్యాన్ ఆఫ్ ద ప్లెయిర్‌గా నిలిచాడు.

లక్ష్మీపార్వతి నియామకాన్ని రద్దు చేయాలి



నిరసన చేపడుతున్న ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు

వెంకోజీపాలెం, జూలై 12: ఏ యూ తెలుగు డి పా ర్ట్‌మెంట్ గౌరవ ప్రొఫెసర్ లక్ష్మీపార్వతి నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగు విభాగం వద్ద ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సం ద ర్భంగా వారు మాట్లాడు తూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి హ యాంలో జరిగిన అక్రమాలు త వ్విన కొద్దీ వెలుగులోకి వస్తున్నాయని, అందులో భాగంగానే లక్ష్మీపార్వతి నియామకం కూడా అని చెప్పారు. తక్షణమే ఆమె నియామకాన్ని రద్దు చేయడంతో పాటు ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాస్, డాక్టర్ సూరి, మంజుల, భాను తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

... 3వ పేజీ తరువాయి

వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించనున్నట్టు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారని తెలిపారు.

విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డు అభివృద్ధికి ఆదేశం

దశల వారీగా తీరం వెంబడి శ్రీకాకుళం జిల్లా మూలపేట వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదిస్తున్నామని, దీనిలో భాగంగా విశాఖ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్డును మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారన్నారు. పర్యాటకాభివృద్ధిలో విశాఖ-భీమిలిబీచ్‌రోడ్డు ప్రధాన భూమిక పోషిస్తుందని పేర్కొన్నట్టు వివరించారు. బీచ్‌రోడ్డుకు జాతీయ రహదారికి నడుమ ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక లింకు రోడ్డునిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారని కలెక్టర్ తెలిపారు.

విశాఖ తీరంలో సీఆర్‌జడ్-3లో ఉన్న ప్రాంతాలను సీఆర్‌జడ్-2కు మార్చాలని పలువురు ఎమ్మెల్యేలు చేసిన ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఆదేశించారన్నారు. తీరంలో ఎక్కువ ప్రాంతం జీవీఎంసీ పరిధిలో ఉన్నందున సీఆర్‌జడ్‌లో క్లాసిఫికేషన్ మార్పు చేయాలని కోరడంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పినట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేయాలన్న సీఎం ఆదేశాల మేరకు వచ్చే వారం భేటీ కానున్నట్టు తెలిపారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, అందుకే అమరావతి, పోలవరం తరువాత విశాఖ పర్యటనకు వచ్చినట్టు సీఎం చెప్పారన్నారు.

నగరంలో ఫ్లైఓవర్లకు ప్రత్యామ్నాయంగా 2 ఎలివేటెడ్ కారిడార్లు

... 3వ పేజీ తరువాయి

సమీక్షలో నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేలు కోరారు. ఆనందపురం నుంచి విశాఖ నగరం, గాజువాక మీదుగా అనకాపల్లి వరకు ఉన్న జాతీయ రహదారికి మరమ్మతులు చేసి ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి ఫ్లైఓవర్లు నిర్మించి జీవీఎంసీకి అప్పగించాలని జాతీయ రహదారుల సంస్థను చాలాకాలంగా జిల్లా యంత్రాంగం కోరుతోంది. భారీ వాహనాలు చాలావరకూ ప్రస్తుతం ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా అనకాపల్లి వెళుతున్నాయి.

ఇటు ఆనందపురం మండలం గంభీరం నుంచి లంకెలపాలెం వరకూ దాదాపు 30 ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. ఈ మార్గంలో కొమ్మాది, కారుషెడ్ జంక్షన్, హనుమంతువాక, ఇసుకతోట, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, మురళీనగర్, షీలానగర్, గాజువాక పోలీస్ స్టేషన్, స్టీల్‌ప్లాంట్ జంక్షన్, లంకెలపాలెం జంక్షన్‌లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్నట్టు తేల్చారు. అయితే ప్రతి జంక్షన్‌లో ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మించడం సాధ్యంకాదని, ఎక్కువ ట్రాఫిక్‌జామ్ అవుతున్న సుమారు 12 జంక్షన్‌లను గుర్తించారు. అయితే ఎనిమిది జంక్షన్లలను కలుపుతూ ఒక ఎలివేటెడ్ కారిడార్, మరో నాలుగు జంక్షన్‌లను కలుపుతూ ఇంకొక ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని జాతీయ రహదారుల సంస్థకు చంద్రబాబు సూచించారు. దీనిపై సమగ్రంగా నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ల కంటే ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణానికి ఖర్చు ఎక్కువైనా వాటి వల్ల సమయం ఆదా అవుతుందని చెప్పడంతో అందుకు తగిన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు అంగీకరించారు. ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణం కోసం కిలోమీటర్లకు రూ.125 కోట్లు అవుతాయని పేర్కొన్నారు. త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్రం నుంచి అనుమతులు తీసుకుంటామని సీఎం చెప్పడంతో అందుకు సంబంధిత ప్రతినిధులు అంగీకరించారు.

హయగ్రీవ పనులకు బ్రేక్

... 3వ పేజీ తరువాయి

కోర్టు సూచించింది. ఆ తరువాత జీవీఎంసీ అధికారులు ఏయే పత్రాలు సమర్పించాలో సూచిస్తూ షార్ట్ ఫాల్ నోటీసు ఇచ్చారు. కలెక్టర్ కూడా ఈ కేసులో ఎన్‌ఓసీ అవసరం లేదని స్పష్టంచేశారు. ఇదే సమయంలో దీనిపై పల్లా శ్రీనివాసరావు, పీతల మూర్తియాదవ్ కోర్టులో కేసు వేయడంతో జీవీఎంసీ కమిషనర్ న్యాయ సలహా కోరారు. మరోవైపు ఈ భూమిపై జీపీఏ పొందిన జి.వెంకటేశ్వరరావు ఆన్‌లైన్‌లో మరోసారి ప్రతిపాదనలు సమర్పించారు. దాంతో కలెక్టర్ ఆ ప్లాన్ ప్రతిపాదనలను హోల్డ్‌లో ఉంచి దానికి సంబంధించిన అభ్యంతరాలు ఏమైనా ఉంటే పరిశీలించాలని ఆదేశించారు. జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ దీనిపై ఎటువంటి ఇంటెరిం ఆర్డర్లు అమలులో లేవని, నిర్మాణానికి అనుమతించవచ్చునని, అయితే రిట్ పిటిషన్ 160/2022, 191/2022ల తీర్పులకు లోబడి ఉండాలని సూచించింది. ఈ మేరకు నిర్మాణానికి అనుమతించారు. అయితే హయగ్రీవ యజమాని అయిన జగదీశ్వరుడు జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి యాజమాన్య హక్కులపై వివాదం తలెత్తినందున అనుమతులన్నీ అబెయెన్స్‌లో పెట్టాలని కోరారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించి, బిల్డింగ్ ప్లాన్ అనుమతిని రద్దు చేయాలని, ఇది తన స్వప్రయోజనాల కోసం కాదని, నేషనల్ జస్టిస్ కోసం కోరుతున్నానన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకోవాలని, అంతవరకూ పనులు ఆపేయాలని సూచిస్తూ జీవీఎంసీ కమిషనర్ నాలుగు రోజుల క్రితం ఆదేశాలు ఇచ్చారు.

ధరలకు కళ్లెం

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వ ఆదేశాలతో పౌర సరఫరాల శాఖ అధికారులు రంగంలోకి దిగి తొలుత హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయించారు. బహిరంగ మార్కెట్‌తో పోల్చితే బియ్యం కిలోకు రూ.ఏడు నుంచి రూ.17 వరకు, కందిపప్పుపై రూ.20 నుంచి రూ.30 తక్కువకు ప్రభుత్వం అందిస్తోంది. వినియోగదారుల సౌకర్యార్థం కౌంటర్ల సంఖ్యను పెంచడంతోపాటు మరికొన్ని నిత్యావసరవస్తువులను అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచనలో పౌర సరఫరాల శాఖ ఉంది. ప్రస్తుతం ప్రతి కౌంటర్‌లో ఒక్కొక్కరికి 25 కిలోల వరకు బియ్యం, కిలో కందిపప్పు అమ్ముతున్నట్టు డీఎస్‌వో వివరించారు. కాగా శుక్రవారం సీతమ్మధార రైతుబజార్‌లోకౌంటర్‌ను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జేసీ మయూర్ అశోక్,ఎంవీపీకాలనీలోఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు.



నరసింహ అవతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం,జూలై 12 : పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు నరసింహ అవతారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ఈమేరకు ఉదయం ఆలయ అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.సాయంత్రం మందిరంలో నరసింహ అవతార విశిష్టతపై పండితులు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూలై 12 : వరాహలక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమ శాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు బాలికల ఎంపిక

భీమునిపట్నం (రూరల్), జూలై 12 : మండలంలోని అమనాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వేమాల జ్ఞానలక్ష్మి, కొయ్యి జాహ్నవి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం విజయకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఇద్దరికీ మంచి మార్కులు రావడంతో సీట్లు వచ్చాయన్నారు. బాలికలను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పద్మనాభం : మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మరగడ ఇందు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. బాలికను పాఠశాల హెచ్‌ఎం వి. శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆనందపురం : గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్‌ఎం సత్యన్నారాయణ తెలిపారు. సవరవిల్లి చంద్రహాసిని శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా ఇందాన హరవింద్ ఒంగోలులో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు చెప్పారు.

కొండపేటలో జనసేన నేతల పర్యటన

తగరపువలస, జూలై 12 : చిట్టివలస పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఒకటో వార్డు జనసేన నాయకులు కోరారు. శుక్రవారం వారు కొండపేటలో ఉన్న జీవీఎంసీ పంపుహౌస్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం విద్యార్థినులు మాట్లాడుతూ వసతి గృహానికి అనుబంధంగా ఉన్న గొట్టపు బావి పాడవ్వడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అలాగే ఇతర సమస్యలను విన్నవించారు. బాలికల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని నాయకులు వారికి హామీ ఇచ్చారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ, జూలై 12 : తోటగరువు ఎర్నిమాంబ కల్యాణ మండపం వద్ద శనివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మోకాళ్ల సంబంధిత వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీధర్ గంగవరపు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

ఆరిలోవ, జూలై 12 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ రవికాంత్ అన్నారు. శుక్రవారం ఆయన కేంద్ర కారాగారానికి సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకులంలో స్వచ్ఛ పక్వాడ మాసోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి).

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 46, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 40, బీరకాయలు 32, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 32, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళా దుంపలు 30, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది) 140, బరబటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 52, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 106, పొటల్స్ 40, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..

రైతు బజార్లలో రాయితీపై కందిపప్పు, బియ్యం



ఎంవీపీ రైతుబజారులో కౌంటరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, జేసీ మయూర్ అశోక్

పెదవాల్తేరు/ఎంవీపీ కాలనీ, జూలై 12 : పెదవాల్తేరు రైతుబజారులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్‌ను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ స్టాల్ ద్వారా రాయితీపై బియ్యం, కందిపప్పు అందిస్తున్నట్టు తెలిపారు. దేశవాళీ కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.181 ఉండగా రైతుబజారులో రూ. 160కి, బియ్యం స్టీమ్డ్ బీపీటీ సోనామసూరి బయట మార్కెట్‌లో కిలో రూ. 55.95 పైసలు ఉండగా ఇక్కడ రూ. 49 లు విక్రయిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, హోటళ్లు, క్యాంటీన్లకు విక్రయించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, పోతన్న రెడ్డి, పీతల అవినాష్,పీతల అమరేంద్ర, రైతుబజారు ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, సురేష్, మాకిన ప్రసాద్, జనసేన 21వ వార్డు అధ్యక్షురాలు గుమ్మడి నందితారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంవీపీ రైతు బజారులో రాయితీపై కందిపప్పు,బియ్యం విక్రయాల కౌంటరును తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. బియ్యం కిలో రూ. 49లకు, కంది పప్పు కిలో రూ. 160లకు విక్రయిస్తున్నారు. 120 కిలోల కంది పప్పు విక్రయించారు. నాలుగు వందల బియ్యం బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఈఓ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, 18 వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, డీఎస్‌ఓ సూర్యప్రకాశ్, పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ నిర్వాసితులను ఆదుకోండి

▶▶ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు 98వ వార్డు కార్పొరేటర్ వినతి

సింహాచలం, జూలై 12 : జీవీఎంసీ 98వ వార్డులో పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు చేపడుతున్న బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితులకు ఒకే విధమైన టీడీఆర్‌లు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన గంటాను ఆయన నివాసంలో కలిసి సమస్య తీవ్రత, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత, విమర్శలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రస్తుతం కొందరికి డొమెస్టిక్ కింద రూ.13 వేలు, కమర్షియల్ కింద రూ. 35 వేలు చొప్పున లెక్కలు వేసి టీడీఆర్‌లు జారీ చేస్తున్నారని, అలా కాకుండా అందరికీ రూ. 35 వేలు విలువైన టీడీఆర్ ఇచ్చేవిధంగా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు లండ శ్రీనివాస్, వార్డు బీసీ విభాగం అధ్యక్షుడు గండ్రెడ్డి వెంకటరమణ, వార్డు మాజీ అధ్యక్షుడు మేకా కానుగోపాల్ పాల్గొన్నారు.



గంటాకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ నరసింహం



దివ్యాంగుల పాఠశాలను సందర్శించిన ఎంఎస్‌కే ప్రసాద్

'హిడెన్ స్ప్రౌట్స్'లో ఎంఎస్‌కే ప్రసాద్

పెదవాల్తేరు, జూలై 12 : పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలను భారత మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. విశాఖ వచ్చిన ప్రతిసారి ఆయన ఇక్కడి విద్యార్థులను కలిసి వారితో గడపడం అలవాటు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల పిల్లలు చేసిన డ్యాన్సులు, పాటలు ఎంతో మానసిక ప్రశాంతతను ఇచ్చాయన్నారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కండిపిల్లి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ టీమ్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్‌వీకే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 12 : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చినగదిలి, పెదగదిలి, హెల్త్ సిటీ, దీనదయాళపురం, సిద్ధార్థ బీసీ కాలనీ, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం ప్రాంతం, శాలిపేట, తోటగరువు, గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరి నగర్, రవీంద్రనగర్, ముస్తాఫా కాలనీ, పార్వతీనగర్, బీటీఆర్ నగర్, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్యనగర్, టీబీసీ పాయింట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

జూపార్కు పరిధిలో..

విశాలాక్షినగర్ : జూపార్కు ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. కూచిపూడి కళావేదిక, జూపార్క్, తహసీల్దార్ కార్యాలయం ప్రాంతం, ఏసీబీ ఆఫీస్, ఈస్ట్ విశాఖ వ్యాలీ,విశాఖ వ్యాలీ స్కూల్, చలపతినగర్ , రెవెన్యూ కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆరిలోవ, జూలై 12 : ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం సుమారు రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హనుమంతవాక సమీపంలోని ఫీడర్ నుంచి మంటలు రావడంతో ఈ సమస్య నెలకొన్నట్టు ఏఈ హైమ తెలిపారు. వెంటనే సిబ్బందితో వెళ్లి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

అతిసారపై అవగాహన ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమలత

తగరపువలస, జూలై 12 : జీవీఎంసీ ఒకటో వార్డులో భీమిలి నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అతిసారపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శాఖ ఏపీడీ సంతోష్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని చెప్పారు.

కొమ్మాది : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శుక్రవారం వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన డ్రై డే-డ్రై డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, నీటి నిల్వ వల్ల డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఓలేటి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం

వెంకోజీపాలెం, జూలై 12 : ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు వలంటీర్లను సన్మార్గంలో నడపాలని, సోషల్ మీడియాకు వారు బానిస కాకుండా చూడాలని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు అన్నారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సెమినార్ హాల్‌లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విజయనగరం, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల అధికారులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలపై దండయాత్ర, స్వీప్, ముఖ్యమైన దినోత్సవాల నిర్వహణ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన వంటి కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. వలంటీర్లు ఓటర్లను అప్రమత్తం చేయడం వల్ల ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. హరినాథ్, విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

భీమునిపట్నం, జూలై 12 : పట్టణంలోని ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విశాఖ ఎన్‌డీ ఆర్‌ఎఫ్ టెన్త్ బెటాలియన్ అధికారులు విపత్తులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ జి. ఈశ్వరరావు మాట్లాడుతూ విపత్తుల వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలు గురించి వివరించారు. అలాగే ప్రమాదాల్లో ఉన్న వారికి సీఆర్‌పీ ఏవిధంగా చేయాలి, ప్రథమ చికిత్స వంటి వాటిని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు అప్పలనాయుడు, శ్రీను, ఎన్‌సీసీ కేర్ టేకర్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు ఏర్పాటు

సింహాచలం, జూలై 12 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే దివ్యాంగుల సౌకర్యార్థం బక్కన్నపాలెం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ 20 వీల్‌చైర్లు అందజేసింది. కలెక్టర్ హరీంద్రప్రసాద్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు డైరెక్టర్ జె. మాధురి, సంస్థ ప్రిన్సిపాల్ సీహెచ్ భాస్కరరావు వీటిని అందజేయగా ఆలయ సిబ్బంది శుక్రవారం వాటిని సింహగిరికి చేర్చారు. వీటిని వయోవృద్ధులు, దివ్యాంగుల సౌకర్యా ర్థం సింహగిరి బస్టాండ్ నుంచి అప్పన్న ఆలయ ధ్వజ స్తంభం వరకు వినియోగించనున్నారు.

కమ్యూనిటీ భవనం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో గొర్లె నాగార్జున, తదితరులు

సింహాచలం, జూలై 12 : జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల కూడలిలో ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ పేరిట రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అంతర్జాతీయ సంస్థకు శాశ్వత ఆవాసం కల్పించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు గోశాల కూడలిలో వ్యాయామం చేయిస్తున్నామని, అలాగే ప్రతి నెల రక్తదాన శిబిరం, షుగర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స, దివ్యాంగులకు, పేదలకు భోజనాలు, అప్పన్న వార్షిక ఉత్సవాల వేళ, హుండీల లెక్కింపు సమయంలో స్వచ్ఛంద సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈనేపథ్యంలో వార్డు పరిధిలో వాకింగ్ ట్రాక్, కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

ఆదాయ పన్ను చెల్లింపులు తప్పనిసరి

జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు

వెంకోజీపాలెం, జూలై 12 : ప్రతి ఉద్యోగి ఆదాయ పన్ను వివరాలను విధిగా ఆదాయ పన్ను శాఖకు నిర్ణీత కాలంలో పొందుపరచాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు చెప్పారు. శుక్రవారం ఆయన 4వ జోన్ సమావేశ మందిరంలో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులతో విశాఖ ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ మధుసూదనరావు, ఆదాయ పన్ను శాఖ అధికారులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రగతి దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతమేర ఆదాయాన్ని ప్రభుత్వానికి పన్నుగా చెల్లించాలని, పన్ను దాఖలలో తప్పుడు సమాచారం ఇస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆదాయ పన్ను పూర్తిగా చెల్లించాలని,మనం కట్టే పన్ను ప్రభుత్వం ద్వారా సమాజ సేవకు ఉపయోగపడుతుందన్నారు. ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ మధుసూదనరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పన్ను చెల్లింపులపై సరైన అవగాహన లేక ఇబ్బందులకు గురవుతున్నారని, పన్ను చెల్లించడం వల్ల ప్రతి ఉద్యోగికి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. 80సీ, 80సీసీ, 8డీడీ, 8ఈఈ తదితర సెక్షన్ల ద్వారా వారి ఆదాయాన్ని బట్టి చెల్లింపులు, మినహాయింపులు జరపవచ్చునన్నారు. ఆదాయ పన్ను పోర్టల్ లో లాగిన్ అయి తమ ఆదాయ పన్ను రిటర్న్‌ను స్వయంగా పొందుపరిచే సౌలభ్యాన్ని వినియోగించుకోవాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం గాను చెల్లించవలసిన ఆదాయపు పన్ను రిటర్న్ 2024 జూలై 31 తేదీగా రిటర్న్ పొందుపరచాలని సూచించారు. అనంతరం ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జీవీఎంసీ జీతాల బిల్లులు సమర్పించే డీడీఓలు ద్వారా ప్రతి ఉద్యోగి తమ ఆదాయంలో పన్ను చెల్లించేందుకు సిద్ధపడాలని చెప్పారు. అనంతరం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పన్ను రిటర్న్ ఏ విధంగా దాఖలు చేయాలి, ఏయే అంశాలు తగ్గింపు, మినహాయింపు పొందవచ్చు అన్న వాటి గురించి వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీసీ సన్యాసిరావు

చిట్టివలసలో ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం



విద్యార్థుల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తగరపువలస, జూలై 12 : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల చేరికల కోసం వినూత్నంగా ప్రచారం చేపట్టారు. ప్రైవేటు స్కూళ్ల మాదిరిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడం వల్ల ఎటువంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. నియోజకవర్గంలో సీబీఎస్‌సీ సిలబస్ అమలు చేస్తున్న పాఠశాల ఇదొక్కటే. ఇక్కడ తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పిస్తే మంచి విద్యతో పాటు సీబీఎస్‌సీ సిలబస్ కూడా బోధిస్తామని చెబుతున్నారు. అలాగే గత ఏడాది పాఠశాలకు వచ్చిన టెన్త్ ఉత్తర్ణత, ట్రిపుల్ ఐటీ, ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ పొందిన విద్యార్థుల వివరాలను కూడా ఫ్లెక్సీలో పొందుపరిచారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం, జూలై 12 : ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో పేపరు బ్యాగులను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై వుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి అన్నారు. శుక్రవారం ఆ కళాశా లలో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాగితపు సంచుల వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. వీటిని రీ సైకిల్ చేయడం ద్వారా కాగితం పునర్వినియోగం అవుతుందన్నారు. అధ్యాపకులు పి. హరిణి, మాణిక్యంనాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సెకనుకు 1,60,000 ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తున్నారని, వాటికి బదులు పేపరు కవర్లు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు ఎల్. సుధాకర్, గొట్టేటి రవి, ఎం. మహాలక్ష్మి, సీఏ సోమయాజులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న చీరాల ఎమ్మెల్యే

సింహాచలం, జూలై 12 : వరాహలక్ష్మీనృసింహస్వామిని బాపట్ల జిల్లా చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కైలాసగిరిపై సౌకర్యాల గురించి ఆరా



క్షేత్రస్థాయి పర్యటనలో వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనరు రవీంద్ర

విశాలాక్షినగర్, జూలై 12 : కైలాసగిరి కొండపై వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ రవీంద్ర అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కైలాసగిరిపై అసంపూర్తిగా ఉన్న భవనాలు, వాణిజ్య సముదాయాలను పరిశీలించి, వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న వాణిజ్య సముదాయాలకు త్వరగా వేలం పెట్టి ఆదాయ వనరులు పెంచేలా చూడాలని అధికారులకు సూచించారు. అలానే నడక దారుల్లో పాడైన టైల్స్ మార్చాలని, పచ్చదనం పెంపొందించడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈ భవానీ శంకర్, డీఏఫ్‌వో శాంతి స్వరూప్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు రాజు, రామరాజు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శార్వాణీ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ ఎల్లాజీకి ముత్తంశెట్టి పరామర్శ

భీమునిపట్నం, జూలై 12 : పట్టణ వైసీపీ సీనియరు నాయకుడు, మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజిని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం ఎల్లాజి గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈమేరకు ముత్తంశెట్టి ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి వాకాబు చేశారు. ఆయనతో పాటు ఆనందపురం మండల వైసీపీ నాయకుడు మజ్జి వెంకటరావు, కాంగ్రెస్ నాయకుడు కదిరి జగన్నాథం ఉన్నారు.

'పురుషోత్తం నియామకం సరికాదు'

వెంకోజీపాలెం, జూలై 12 : ఏయూతో సంబంధం లేని హనుమంతు పురుషోత్తంను ఏఆర్ఆర్ సెంటర్ హానరరీ డైరెక్టర్‌గా నియమించడం హాస్యాస్పదంగా ఉందని ఏయూ పరిరక్షణ సమితి పేర్కొంది. ఈమేరకు సమితి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డి కేంద్ర సర్వీసులో పని చేసిన పురుషోత్తంను 2021 లో అగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్‌కి హానరరీ డైరెక్టరుగా నియమించారని, ఏయూలో గాని, సెంటర్‌లో గాని ఉద్యోగి కాని ఆయన్ను హానరరీ డైరెక్టర్‌గా నియమించడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అంధ బాలికల పాఠశాలను సందర్శించిన జడ్జిలు

సాగర్‌నగర్, జూలై 12 : బీచ్ రోడ్డులోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను చోడవరం పట్టణానికి చెందిన జడ్జిలు శుక్రవారం సందర్శించారు. న్యాయ అవగాహన సదస్సుల్లో పాల్గొనడానికి నగరానికి వచ్చిన వారు మార్గ మధ్యలో ఉన్న ఆశ్రమాన్ని చూసి, బాలికల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం వసతి, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకుని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు జి. స్వర్ణ, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

నారుమడి యాజమాన్య పద్ధతులతో మేలు

పద్మనాభం, జూలై 12 : రైతులు వరి నారుమడి యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ చలం చెప్పారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నారు వేసే ముందు కిలో విత్తనాలకు 3 గ్రాముల కార్బండిజం లేదా సూడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం 24 గంటలు నీటిలో నాన బెట్టాలని, మరో 24 గంటలు మండ కట్టుకోవాలన్నారు. వారం రోజుల పాటు నీరు పెడుతూ తీస్తూ ఉండాలన్నారు. నారుమడిలో కలుపు వస్తే బూటాక్లోర్ కలుపు మందు 5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

గాయపడిన యువకుడికి ఆర్థిక సహాయం

పద్మనాభం, జూలై 12 : కృష్ణాపురంలో చెట్టు పైనుంచి జారిపడి గాయపడిన యువకుడికి దాతలు సమకూర్చిన నగదును టీఎన్‌ఎస్‌ఎఫ్ భీమిలి నియోజకవర్గం అధ్యక్షుడు కె. సుమంత్‌నాయుడు, ఎం.అప్పలనాయుడు (అన్నమయ్య) శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన శివనారాయణ చెట్టుపై నుంచి పడిపోవడంతో రెండు చేతులు విరిగిపోయాయి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో సుమంత్ దాతల సహాయం కోరి రూ. 11400 సమకూర్చి, అందజేశారు.

'ఐక్య పోరాటాలతోనే విజయం'

కూర్మన్నపాలెం, జూలై 12 : ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరం శుక్రవారం నాటికి 1247 రోజులకు చేరుకొంది. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమార స్వామి స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రణాళిక రూపొందించేందుకు, పరిస్థితిని చక్కదిద్దేందుకు 45 రోజులు సమయం పడుతుందని తెలిపారన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా ఆయన ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజల ఆత్మ గౌరవమైన ఉక్కును కాపాడుకోవడమే కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రక్రియను రద్దుచేసే వరకు పోరాటం ఆగదన్నారు.